

# ప్రజాతీర్పు - 2024



## 11,75,092 ఓట్ల మెజార్టీ

**దేశంలోనే అత్యధికం**

**ఇండోర్ బీజేపీ అభ్యర్థి లాల్వానీఘన విజయం**

భోపాల్, జూన్ 4: ఈ సార్వత్రిక ఎన్నికలలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బీజేపీ సిట్టింగ్ ఎంపీ అభ్యర్థి శంకర్ లాల్వానీ అత్యధిక మెజారిటీలో చరిత్ర సృష్టించారు. ఆయన తన ప్రత్యర్థిపై 11 లక్షల 75 వేల 92 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఇది దేశ ఎన్నికల చరిత్రలోనే అత్యధిక మెజారిటీ అని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఓట్ల మెజారిటీలోనే కాదు అత్యధిక నోటా ఓట్లు పోలైన నియోజకవర్గంగా కూడా ఇండోర్ రికార్డుల్లో నిలిచింది. ఇక్కడ నోటాకు అత్యధికంగా 2.18 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఇండోర్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అక్షయ్ కాంతి బామ్ చివరి నిమిషంలో నామినేషన్ విత్‌డ్రా చేసుకుని పార్టీకి షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో నోటాకు ఓటు వేయాలని ప్రజలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది.



## మహారాష్ట్రలో 'మహా వికాసం'

**ఎంవీఏకు 30 స్థానాలు.. బీజేపీకి 9 సీట్లే**

**ఉద్ధవ్, శరద్‌పవార్‌కు బూస్టనిచ్చిన ఫలితాలు**

ముంబై, జూన్ 4: పార్టీలను చీల్చి..రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకున్న ఎన్డీయే కూటమికి మహారాష్ట్రలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్ వర్గం), ఎన్సీపీ (శరద్‌పవార్)లతో కూడిన మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) 30 స్థానాల్ని గెలుచుకుని సత్తాచాటింది. మొత్తం 48 ఎంపీ స్థానాల్లో 29 సీట్లను ఎంవీఏ కైవసం చేసుకుంది. బీజేపీకి ఈసారి 9 సీట్లు మాత్రమే దక్కాయి. శివసేన (షిండే వర్గం)-7, ఎన్సీపీ (అజిత్ వర్గం)-1 స్థానం గెలుచుకున్నాయి. డిప్యూటీ సీఎం అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ బారామతిలో ఓడిపోయారు.

**పార్టీ, గుర్తును లాగేసుకున్నా..**

పార్టీలను అడ్డదిడ్డంగా చీల్చేశారు. గుర్తులను కూడా బలవంతంగా లాగేసుకున్న బీజేపీ ప్రజల అభిమానాన్ని లాక్కోలేకపోయింది. అధికార శివసేనను షిండే ద్వారా నిలువునా చీల్చేసిన బీజేపీ అక్కడితో ఆగలేదు, పార్టీ గుర్తును కూడా లాగేసుకుంది. ఆ తర్వాత అజిత్ పవార్‌కు పదవి ఆశ చూపి శరద్‌పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని నిలువునా చీల్చి గుర్తును లాగేసుకుంది. అయితేనేం.. ప్రజల మనసుల్లో ఆ పార్టీల్లో ఉన్న అభిమానాన్ని తుడిచేయలేకపోయింది.

## హర్యానాలో బీజేపీకి ఎదురుదెబ్బ

**5 స్థానాలను దక్కించుకున్న కాంగ్రెస్**

చండీగఢ్: హర్యానాలో అధికార బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ బాగా పుంజుకుంది. మొత్తం 10 సీట్లలో మూడింటిలో విజయం సాధించగా, రెండింటిలో పూర్తి ఆధిక్యంలో ఉంది. 2019 ఎన్నికల్లో 10 సీట్లను దక్కించుకున్న బీజేపీ ఇప్పుడు సగం పోగొట్టుకుని ఐదింటితోనే సరిపెట్టుకుంది. అన్ని స్థానాల్లో పోటీ చేసిన జేజేపీ, నాలుగు స్థానాల్లో పోటీ చేసిన ఐఎన్‌ఎల్‌డీ, తొమ్మిదింటిలో బరిలోకి దిగిన బీఎస్పీకి డిపాజిట్లు దక్కలేదు. బీజేపీ మాజీ సీఎం ఖట్టర్ కర్నీ లోక్‌సభ స్థానంలో భారీ ఆధిక్యంలో ఉన్నారు. కర్నల్ అసెంబ్లీ ఉప ఎన్నికలో హర్యానా సీఎం నాయబ్ సింగ్ సైనీ 41,540 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో ఈ ఎన్నికల్లో ఓటింగ్ 28.42 నుంచి 43.68 శాతానికి పెరగడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ తాము గెలుస్తామని మాజీ సీఎం హుడా ధీమా వ్యక్తం చేశారు.

## పంజాబ్‌లో పడిలేచిన కాంగ్రెస్

**కాంగ్రెస్-7, ఆప్-3 స్థానాలు..బీజేపీకి సున్నా**

న్యూఢిల్లీ, జూన్ 4: పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకుంది. మొత్తం 13 ఎంపీ స్థానాలున్న ఈ రాష్ట్రంలో 7 సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఆప్-3 స్థానాల్లో, శిరోమణి అకాలీదళ్ ఒక స్థానంలో గెలిచాయి. జైల్లో ఉన్న సిక్కు వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్ సహా మరో ఇద్దరు స్వతంత్రులు విజయం సాధించి సంచలనం సృష్టించారు. దేశ సరిహద్దులోని అత్యంత కీలమైన ఈ రాష్ట్రంలో బీజేపీ ఖాతా తెరవలేదు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కాంగ్రెస్ పుంజకోవటం గమనార్హం. మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ, అమరీందర్ సింగ్ రాజా, సుఖీందర్ సింగ్, ఎస్‌ఏడీకు చెందిన హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, ఆప్‌కు చెందిన గుర్మీత్ మీత్ హాయర్.. గెలుపొందిన వారిలో ముఖ్య నాయకులు.

**పంజాబ్ (మొత్తం స్థానాలు-13)**

| | |
|---|---|
| కాంగ్రెస్ | 7 |
| ఆప్ | 3 |
| ఎస్ఏడీ | 1 |
| స్వతంత్రులు | 2 |

# బీజేపీకి పాంచ్ పంచ్

**తీవ్రంగా నష్టం చేసిన ఐదు అంశాలు.. సీట్లు తగ్గడానికి ప్రధాన కారణాలు**

న్యూఢిల్లీ, జూన్ 4: భారతీయ జనతా పార్టీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో రెండు లక్ష్యాలతో బరిలోకి దిగింది. సొంతంగా 370 సీట్లు సాధించాలని, ఎన్డీఏ కూటమికి 400 సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఈ రెండింటికీ భారీ దూరంలో నిలిచిపోయింది. బీజేపీ 241 సీట్లు మాత్రమే సాధించగలిగింది. ఒంటరిగా మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోలేకపోయింది. ఎన్డీఏ కూటమిగా మ్యాజిక్ ఫిగర్‌ను అందుకున్నప్పటికీ ఈ ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన ఫలితాలు మాత్రం దక్కలేదు. ఇందుకు ప్రధానంగా ఐదు కారణాలను రాజకీయ విశ్లేషకులు చూపిస్తున్నారు.



**1. యూపీలో ఎదురుదెబ్బ**

బీజేపీకి ఉత్తరప్రదేశ్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 80 సీట్లు ఉన్న యూపీలో 2019లో 62 స్థానాలు సాధించిన బీజేపీ ఈసారి కూడా కనీసం 60 స్థానాలు ఖాతాలో వేసుకోవాలని బీజేపీ భావించింది. అయితే, 33 స్థానాలకే బీజేపీ పరిమితమైంది. ఇంతకాలం బీజేపీకి కంచుకోటలా భావించిన రాష్ట్రంలో ఇండియా కూటమి అనూహ్యంగా పుంజుకుంది. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి రాష్ట్రంలో 43 స్థానాలను దక్కించుకొని బీజేపీకి ఊహించని విధంగా షాకిచ్చాయి. దేశవ్యాప్తంగా బీజేపీ సీట్లు తగ్గడానికి యూపీ ప్రధాన కారణమైంది.

**2. విఫలమైన రామమందిర ప్రచారం**

అయోధ్యలో రామమందిర నిర్మాణం జరగడం తమకు కలిసొస్తుందని బీజేపీ నేతలు అంచనా వేసుకున్నారు. ఈ అంశాన్ని బాగా ప్రచారం చేశారు. అయితే, అయోధ్య ప్రాంతంలోనూ రామమందిర నిర్మాణం రాజకీయ లాభాన్ని ఇవ్వలేదు. అయోధ్య ఉన్న ఫైజాబాద్‌లో బీజేపీ ఓడిపోయింది. చుట్టుపక్కల ఉన్న ఏడు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ బీజేపీ కేవలం కైసర్‌గంజ్, గోండాలో మాత్రమే గెలిచింది. అమేథీ, బారాబంకిలో కాంగ్రెస్, సుల్తాన్‌పూర్, అంబేద్కర్‌నగర్, బస్తీలో సమాజ్‌వాదీ పార్టీ గెలిచింది.

**3. అగ్నిపథ్ పథకం పట్ల ఆగ్రహం**

సైనిక బలగాల్లో నియామకాలకు సంబంధించి బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం కూడా బీజేపీకి నష్టం చేసింది. ఉద్యోగభద్రత కొరవడిన ఈ పథకం పట్ల యువతలో ఆగ్రహావేశాలు వ్యక్తమైనా బీజేపీ వెనక్కు తగ్గలేదు. ఈ ప్రభావం ఈ ఎన్నికల్లో చూపించింది. సైన్యంలోకి ఎక్కువ మంది యువతను పంపించే రాజస్థాన్, హర్యానాలో బీజేపీ బాగా నష్టపోయింది. హర్యానాలో 2019లో బీజేపీ మొత్తం 10 స్థానాలను గెలుచుకోగా ఈసారి మాత్రం ఐదు స్థానాల్లోనే గెలిచింది. గత ఎన్నికల్లో 25కు 25 స్థానాలు గెలిచిన రాజస్థాన్‌లో ఈసారి 14 మాత్రమే గెలుచుకుంది.

**4. పార్టీలను చీల్చిన ఫలితం**

మహారాష్ట్రలో గత మూడేండ్లుగా బీజేపీ ఆడుతున్న రాజకీయ ఆటలు కూడా ఆ పార్టీకి ఈసారి నష్టం చేశాయి. సుదీర్ఘకాలం మిత్రపక్షంగా కొనసాగిన శివసేనను చీల్చి, ఉద్ధవ్ ఠాక్రేను ముఖ్యమంత్రి పదవి నుంచి దించేయడం, పార్టీ పేరు, గుర్తు కూడా దక్కకుండా చేయడంలో బీజేపీ మద్దతు ఉందనే వాదన ఉంది. మరోవైపు మహారాష్ట్ర రాజకీయ కురువృద్ధుడు శరద్ పవార్ పార్టీ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)ని చీల్చడం వెనుకా బీజేపీ ఉందనే భావన ప్రజల్లో నెలకొన్నది. ఈ అంశాలు మహారాష్ట్రలో బీజేపీకి నష్టం చేశారు. మహారాష్ట్రలో 2019లో 23 సీట్లు గెలిచిన బీజేపీ ఈసారి కేవలం 10 సీట్లకే పరిమితమైంది.

**5. కొత్త నేతలకు ఎదురుగాలి**

ఎన్నికల ముందు కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీల నుంచి బీజేపీ పెద్ద ఎత్తున నేతలను చేర్చుకుంది. వీరి వల్ల బీజేపీకి కలిగిన లాభమేమీ కనిపించకపోగా నష్టం జరిగింది. ఇలా చేరిన వారికి బీజేపీ టికెట్లు ఇచ్చి బరిలో నిలిపినా ఎక్కువ మంది ఓడిపోయారు. పంజాబ్‌లో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన రవ్‌నీత్ బిట్టు, ప్రనీత్ కౌర్, హర్యానాలో అశోక్ తన్వర్, జార్ఖండ్‌లో గీతా కోడా వంటి వారు ఓటమిని చవిచూశారు.

## పరాజయం పాలైన ప్రముఖులు

| | |
|---|---|
| స్మృతి ఇరానీ | బీజేపీ |
| రాజీవ్ చంద్రశేఖర్ | బీజేపీ |
| మేనకా గాంధీ | బీజేపీ |
| తమిళిసై సౌందర్‌రాజన్ | బీజేపీ |
| అన్నామలై | బీజేపీ |
| అజయ్ కుమార్ | బీజేపీ |
| నకుల్ కమల్‌నాథ్ | కాంగ్రెస్ |
| దిగ్విజయ సింగ్ | కాంగ్రెస్ |
| వైభవ్ గెహ్లాట్ | కాంగ్రెస్ |
| ఆనంద్ శర్మ | కాంగ్రెస్ |
| విక్రమాదిత్య సింగ్ | కాంగ్రెస్ |
| డీకే సురేశ్ | కాంగ్రెస్ |
| పన్నీర్‌సెల్వం | స్వతంత్ర అభ్యర్థి |
| ఒమర్ | నేషనల్ కాన్ఫరెన్స్ |
| మెహబూబా ముఫ్తీ | పీడీపీ |
| ప్రజ్వల్ రేవణ్ణ | జేడీఎస్ |
| రోహిణి ఆచార్య | ఆర్జేడీ |
| ఉపేంద్ర కుష్వాహా | ఆర్‌ఎల్‌ఎం |



## ఉప ఎన్నికల్లో గెలిచిన కల్పనా సొరేన్

రాంచీ : జార్ఖండ్‌లోని గాండేయ్ శాసన సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ సతీమణి కల్పనా సొరేన్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి దిలీప్ కుమార్ వర్మపై ఆమె 27 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అవసరమైంది. ఫలితాలు వెలువడిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, తనకు మద్దతిచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. జేఎంఎం చీఫ్ శిబు సొరేన్, తన భర్త హేమంత్‌లకు కృతజ్ఞతలు చెప్పారు. ప్రజల కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తానని తెలిపారు. ఇండియా కూటమి ఐక్యంగా ముందుకెళ్తుందన్నారు.

## మధ్యప్రదేశ్‌లో బీజేపీ క్లీన్‌స్వీప్

**మొత్తం 29 స్థానాల్లో గెలుపు**

భోపాల్, జూన్ 4: మధ్యప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల 40 ఏండ్ల చరిత్రను బీజేపీ తిరగరాసింది. మొత్తం 29 లోక్‌సభ స్థానాల్ని కైవసం చేసుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, ఫాఘన్ సింగ్ కులస్తే, వీరేంద్ర కుమార్, మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, రాష్ట్ర బీజేపీ చీఫ్ విష్ణుదత్ శర్మ..తదితరులు మంచి మెజార్టీతో గెలుపొందారు. అలాగే కాంగ్రెస్ కంచుకోట చింద్వారాలోనూ కాషాయం తన జెండాను ఎగురవేసింది. 1952లో ఈ స్థానాన్ని గెలుచుకున్న బీజేపీ, మళ్లీ ఇక్కడ విజయాన్ని అందుకుంది. రాయ్‌గఢ్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ 1.45 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. బీజేపీ రాజ్యసభ ఎంపీగా ఉన్న సింధియా, గుణా స్థానం నుంచి 5,40,929 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

## రాజస్థాన్‌లో బీజేపీకి ఎదురుగాలి

**10 స్థానాలను కోల్పోయిన కమలం**

జైపూర్, జూన్ 4: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఊపుమీదున్న బీజేపీకి సార్వత్రిక ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలింది. గత సార్వత్రిక ఎన్నికల్లో రాజస్థాన్‌లోని 25 స్థానాలకుకు గానూ 24 సీట్లను గెలుపొందిన ఆ పార్టీ ఈసారి చతికిలపడింది. గతంతో పోలిస్తే 10 సీట్లను కోల్పోయిన కమలం పార్టీ 14 స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఏకంగా సీఎం ఇలాకాలో ఆ పార్టీ అభ్యర్థి ఓటమి పాలవడం గమనార్హం. మరోవైపు సీపీఐ(ఎం), రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్‌ఎల్పీ)లతో కలిసి బరిలో దిగిన కాంగ్రెస్ 10 స్థానాల్లో గెలుపొందగా.. కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన భారత్ ఆదివాసీ పార్టీ (బీఏపీ) కూడా ఒక స్థానంలో విజయం సాధించింది. దీంతో రాజస్థాన్‌లో ఇండియా కూటమి బలం 11కు చేరింది. మరోవైపు బగిడోర అసెంబ్లీ స్థానానికి నిర్వహించిన ఉప ఎన్నికలో బీఏపీ జయకేతనం ఎగురవేసింది.

## ఉత్తరాఖండ్‌లో కమలం హ్యాట్రిక్

**మూడోసారి క్లీన్‌స్వీప్**

**ఐదు సీట్లూ కైవసం**

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో బీజేపీ హ్యాట్రిక్ సాధించింది. రాష్ట్రంలోని ఐదు లోక్‌సభ స్థానాలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. ఈ పర్వత ప్రాంత రాష్ట్రంలో 2014 లోక్‌సభ ఎన్నికల నుంచి 2017, 2022 అసెంబ్లీ ఎన్నికలు సహా ఇప్పటివరకు కాంగ్రెస్‌పై బీజేపీ పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నది. బీజేపీకి ఈ ఎన్నికల్లో 56.8 శాతం ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 32.8 శాతం మాత్రమే దక్కాయి. కేంద్ర సహాయ మంత్రి అజయ్ భట్ నైనిటాల్ ఉద్ధమ్ సింగ్ నగర్‌లో 3.34 లక్షల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిపై విజయం సాధించారు. అలాగే హరిద్వార్‌ను మాజీ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ గెల్చుకున్నారు. దేశ ప్రజలు మరోసారి మోదీ నాయకత్వానికే మద్దతు తెలిపారని, అందుకే రాష్ట్రంలోని అన్ని సీట్లలో మరోసారి బీజేపీకే పట్టం కట్టారని స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించిన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పేర్కొన్నారు.

# ఒడిసిన నవీన్ కథ!

- ఒడిశాలో బీజేడీ జోరుకు బీజేపీ బ్రేకులు
- అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం
- 147కి 78 నియోజకవర్గాల్లో జయకేతనం రాష్ట్రంలో తొలిసారి సొంతంగా అధికారం
- ఒకచోట గెలిచి మరోచోట ఓడిన నవీన్
- ఓటమి పాలైన స్పీకర్, పలువురు మంత్రులు



భువనేశ్వర్, జూన్ 4: ఒడిశాలో దాదాపు 24 ఏండ్ల పాటు ఏకచత్రాధిపత్యం చెలాయించిన రాష్ట్ర సీఎం, బిజూ జనతాదళ్(బీజేడీ) అధినేత నవీన్ పట్నాయక్ జైత్రయాత్రకు బ్రేక్ పడింది. రాష్ట్రంలో గత రెండు దశాబ్దాలకు పైగా ఆధిపత్యం ప్రదర్శించిన ఆయనకు బీజేపీ ఎట్టకేలకు అడ్డుకట్ట వేయగలిగింది. మంగళవారం విడుదలైన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికార బిజూ జనతాదళ్ పరాజయం పాలైంది. 147 నియోజకవర్గాలున్న అసెంబ్లీలో బీజేపీ 78 సీట్లు సాధించి విజయకేతనం ఎగురవేసింది. బీజేడీ 51 స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగింది. దీంతో రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వ ఏర్పాటు చేసేందుకు కమలం పార్టీ సిద్ధమైంది. మరోవైపు మిగతా స్థానాలను కాంగ్రెస్ పార్టీ, సీపీఎం, స్వతంత్రులు పంచుకొన్నారు. రెండు స్థానాల నుంచి పోటీచేసిన నవీన్ పట్నాయక్ ఒకచోటనే గెలుపొందగా, మరోచోట ఓడిపోవడం గమనార్హం.

**2024 ఒడిశా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు**

| పార్టీ | గెలిచిన సీట్లు |
|---|---|
| బీజేపీ | 78 |
| బీజేడీ | 51 |
| కాంగ్రెస్ | 14 |
| సీపీఎం | 1 |
| స్వతంత్రులు | 3 |

2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
బీజేడీ-112, బీజేపీ-23, కాంగ్రెస్-9, సీపీఎం-1, స్వతంత్రులు-1

**లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ హవా**

ఒడిశాలో లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లోనూ బీజేపీ ఆధిక్యం కనబర్చింది. రాష్ట్రంలో మొత్తం 21 లోక్‌సభ స్థానాలు ఉండగా.. ఎన్నడూ లేని విధంగా ఏకంగా 19 స్థానాల్లో కమలం పార్టీ విజయం సాధించింది. రాష్ట్రంలోని అధికార బీజేడీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కాగా, కాంగ్రెస్ పార్టీ కూడా ఒక్క సీటుతోనే సరిపెట్టుకొన్నది.

### ముగిసిన నవీన్ శకం

తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో అత్యధిక కాలం సీఎంగా చేసి రికార్డు సృష్టించే అవకాశాన్ని నవీన్ పట్నాయక్ కోల్పోయారు. నవీన్ పట్నాయక్ 2000 మార్చిలో తొలిసారి సీఎం అయిన నాటి నుంచి ఇప్పటి వరకు సీఎంగా కొనసాగుతున్నారు. ఆయన ముఖ్యమంత్రిగా 24 ఏండ్ల 90 రోజులకు పైగా పనిచేశారు. మరోసారి గెలిచి, అధికార పీఠం ఎక్కి ఉంటే.. అత్యధిక కాలం సీఎంగా చేసిన వారిలో సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డును పట్నాయక్ దాటేసేవారు. చామ్లింగ్ ఆ రాష్ట్రానికి 24 ఏండ్ల 165 రోజులు సీఎంగా విధులు నిర్వర్తించారు. దీర్ఘకాలం సీఎంగా చేసిన వారిలో చామ్లింగ్, నవీన్ పట్నాయక్ తర్వాతి వరుసలో జ్యోతిబసు(పశ్చిమబెంగాల్-23 ఏండ్ల 137 రోజులు), గెగాంగ్ అపాంగ్(అరుణాచల్‌ప్రదేశ్-22 ఏండ్ల 250 రోజులు), లాల్ థన్హ్వాల్(మిజోరం- 22 ఏండ్ల 60 రోజులు), వీరభద్రసింగ్(హిమాచల్‌ప్రదేశ్- 21 ఏండ్ల 13 రోజులు) ఉన్నారు.

## గుజరాత్‌లో బీజేపీ హవా

**25 స్థానాల్లో 24 గెలుపు..కాంగ్రెస్‌కు ఒకటి**

**అమిత్ షాకు 7,44,716 ఓట్ల మెజార్టీ**

అహ్మదాబాద్, జూన్ 4: ప్రధాని మోదీ, అమిత్ షా సొంత రాష్ట్రం గుజరాత్‌లో బీజేపీకి మరోమారు భారీ విజయం దక్కింది. క్లీన్‌స్వీప్ చేసే అవకాశం తృటిలో తప్పింది. రాష్ట్రంలోని 25 స్థానాలకు (సూరత్ మినహా) ఎన్నికలు నిర్వహించగా 24 ఎంపీ స్థానాల్ని బీజేపీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ గెలుపు ఒకే ఒక స్థానానికి (బనస్‌కాంత) పరిమితమైంది. అంతేగాక, ఐదు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీజేపీ గెలుపొందింది. గాంధీనగర్ నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్ షా భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆయనకు 7,44,716 ఓట్ల మెజార్టీ లభించింది. మరో ఇద్దరు కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవీయ, పురుషోత్తమ్ రూపాలా ఇద్దరూ భారీ మెజార్టీతో విజయం అందుకున్నారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఇక్కడ అన్ని స్థానాల్ని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈసారి ఎన్నికల ప్రక్రియ మొదలు కాకుండానే బీజేపీ సూరత్ స్థానాన్ని కైవసం చేసుకోవటం వివాదాస్పదమైంది. కాంగ్రెస్ సహా ఇతర పార్టీల అభ్యర్థులను ఎన్నికల బరి నుంచి తప్పించి.. ఏకగ్రీవం చేసుకున్నారన్న విమర్శలున్నాయి.

## మణిపూర్‌లో కమలానికి షాక్

**రెండు చోట్లా ఓటమి.. ఈశాన్యంలో 13 సీట్లలో గెలుపు**



బీజేపీ ఎంపీగా గెలిచిన కామాఖ్య ప్రసాద్‌కు ఏజీపీ అధ్యక్షుడు బోరా అభినందన

ఇంఫాల్/అగర్తలా, జూన్ 4: ఈశాన్య రాష్ట్రాల్లో కొంచెం అటుఇటుగా గత లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే రిపీట్ అయ్యాయి. అయితే గత ఏడాది మే నుంచి రెండు జాతుల మధ్య ఘర్షణతో అట్టుడుకుతున్న బీజేపీ అధికారంలో ఉన్న మణిపూర్‌లో ఎన్డీయే కూటమి రెండు లోక్‌సభ స్థానాలను కోల్పోయింది. 2019 ఎన్నికల్లో ఇన్నర్ మణిపూర్‌ను బీజేపీ, ఔటర్ మణిపూర్‌ను ఆ పార్టీ మిత్రపక్షం నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్) గెలుచుకోగా.. ఈసారి ఆ రెండు స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకొన్నది. మరోవైపు 14 లోక్‌సభ స్థానాలు ఉన్న అస్సాంలో గత ఎన్నికల మాదిరిగానే బీజేపీ తొమ్మిది, కాంగ్రెస్ మూడు స్థానాల్లో విజయం సాధించాయి. అరుణాచల్‌లో రెండు ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకొన్నది. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అరుణాచల్ వెస్టు నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నబం టుకిపై లక్షకు పైగా ఓట్ల మెజార్టీతో గెలిచారు. నాగాలాండ్ లోక్‌సభ స్థానాన్ని 20 ఏండ్ల తర్వాత కాంగ్రెస్ గెలుచుకొని చరిత్ర సృష్టించింది. త్రిపురలో రెండు స్థానాలను బీజేపీ నిలబెట్టుకొన్నది. మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ త్రిపుర వెస్టు నుంచి సమీప కాంగ్రెస్ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అశిష్ కుమార్ సాహాను ఆరు లక్షల భారీ మెజార్టీతో ఓడించారు. మిజోరంలో జడ్‌పీఎం అభ్యర్థి రిచర్డ్ గెలిచారు. సిక్కింలో ఉన్న ఒకే ఒక్క లోక్‌సభ స్థానాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించిన సిక్కిం క్రాంతికారా మోర్చా(ఎస్‌కేఎం) గెలుచుకొన్నది. మేఘాలయలో కాంగ్రెస్, వాయిస్ ఆఫ్ పీపుల్ పార్టీ(వీవోటీపీపీ) ఒక్కో స్థానం చొప్పున విజయం సాధించాయి.

## జార్ఖండ్‌లో ఎన్డీయేకి తగ్గిన సీట్లు

రాంచీ: గత ఎన్నికలలో పోలిస్తే జార్ఖండ్ రాష్ట్రంలో బీజేపీ హవా స్వల్పంగా తగ్గింది. మొత్తం 14 స్థానాల్లో బీజేపీ 8, దాని మిత్రపక్షం ఏజేఎస్‌యు ఒక స్థానంలో విజయం సాధించగా, కాంగ్రెస్ రెండు, దాని మిత్రపక్షం జేఎంఎం మూడు సీట్లు గెల్చుకున్నాయి. 2019 ఎన్నికల్లో బీజేపీ 11, ఏజేఎస్‌యూ, కాంగ్రెస్, జేఎంఎం తలా ఒక సీటు గెలిచాయి. ఇక్కడ బీజేపీ నుంచి బరిలోకి దిగిన కేంద్ర మంత్రి, సిట్టింగ్ ఎంపీ అర్జున్ ముండా పరాజయం పాలయ్యారు. మరో మంత్రి అన్నపూర్ణ దేవి కొడెర్మలో తన ప్రత్యర్థిపై 1.37 లక్షల ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడా సతీమణి, ఎన్నికల ముందు బీజేపీలో చేరిన గీతా కోరా జేఎంఎం అభ్యర్థి చేతిలో ఓటమి దిశగా ఉన్నారు.

## ఎన్నికల మైదానంలోనూ క్రీడాకారుల సత్తా

న్యూఢిల్లీ: ఈ ఎన్నికల్లో క్రీడాకారులు సైతం ఎన్నికల బరిలో దిగి తమ సత్తాను ప్రదర్శించుకున్నారు. బెంగాల్‌లో టీఎంసీ తరపున పోటీ చేసిన మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ కాంగ్రెస్ దిగ్గజ నేత అధీర్ రంజన్‌ను ఓటమి బాట పట్టించారు. గుజరాత్‌కు చెందిన పఠాన్ బరంపురంలో లోక్‌సభ విపక్ష నేత, ఐదుసార్లు ఎంపీ అయిన అధీర్‌కు గట్టి షాక్ ఇచ్చారు. అలాగే 1983 ప్రపంచ కప్ జట్టులో సభ్యుడైన మరో మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ టీఎంసీ తరపున బర్ధమాన్-దుర్గాపూర్‌లో ప్రముఖ బీజేపీ నేత దిలీప్ ఘోష్‌ను ఓడించారు. అలాగే పారాలింపిక్‌లో జావెలిన్ త్రో విభాగంలో బంగారు పతక విజేత అయిన దేవేంద్ర జజారియా రాజస్థాన్ చురులో బీజేపీ టికెట్‌పై పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓడారు. హాకీ దిగ్గజ ఆటగాడు, హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కే బీజూ జనతాదళ్ నుంచి ఒడిశాలోని సుందర్‌గర్‌లో పోటీ చేసి కేంద్ర మంత్రి జూయల్ ఓరమ్ చేతిలో పరాజయం పొందారు.

## ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు




న్యూఢిల్లీ, జూన్ 4: దేశంలో ఎక్కడ, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎగ్జిట్ పోల్స్ కోసం రాజకీయ నాయకులే కాదు, ప్రజలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు వాస్తవ ఫలితాలు అటూఇటుగా వచ్చే అవకాశం ఉండడంతో ముందే ఓ అంచనాకు వస్తారు. అయితే, ఈసారి మాత్రం ఎగ్జిట్ పోల్స్ అంచనాలు దారుణంగా దారితప్పాయి. ఏ ఎగ్జిట్ పోల్ అంచనా కూడా ఇండియా కూటమిని పెద్దగా లెక్కలోకి తీసుకోలేదు. కానీ, వాస్తవ ఫలితాల్లో మాత్రం కాంగ్రెస్ కూటమి దూసుకెళ్తున్నది. ఏకంగా 230కిపైగా స్థానాల్లో ఆధిక్యంలోకి దూసుకెళ్లి బీజేపీ కూటమికి గట్టిపోటీ ఇచ్చింది. మరీ ముఖ్యంగా రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో ఊహకు అందని విధంగా సత్తాచాటింది. అధికార ఎన్డీయేకు 350కి పైగా వస్తాయన్న ఎగ్జిట్ పోల్ అంచనాలు తలకిందులయ్యాయి. రాజస్థాన్, హర్యానాలో కాంగ్రెస్ మళ్లీ పుంజుకున్నది. యూపీలో సమాజ్‌వాదీ పార్టీతో జతకట్టిన కాంగ్రెస్.. బీజేపీని రెండో స్థానానికి పరిమితం చేయడాన్ని ఎవరూ ఊహించలేకపోయారు.

# బీజేపీని ఆదుకున్న దక్షిణ భారతం

**50 స్థానాల వరకూ గెలిచిన ఎన్డీయే.. • మ్యాజిక్ ఫిగర్‌ను దాటడంలో ఇవే కీలకం**

న్యూఢిల్లీ, జూన్ 4: ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో చావుదెబ్బ తిన్న బీజేపీ దాని మిత్రపక్షాలు దక్షిణ భారతంలో మాత్రం నిలదొక్కుకోగలిగాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో 60 నుంచి 70 సీట్ల వరకూ కోల్పోయిన ఎన్డీయే పక్షాలు దక్షిణాన 50 సీట్ల వరకూ గెలుచుకోగలిగాయి. ఈ స్థానాలే కమలనాథులను మ్యాజిక్ ఫిగర్‌ను అందుకొనేలా చేశాయి. గత ఎన్నికల్లో బీజేపీతో విభేదించి ఒంటరిగా పోటీ చేసిన తెలుగుదేశం ఈ సారి మాత్రం ఎన్డీయే కూటమిలో చేరిపోయింది. ఆ పార్టీ అనూహ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో 16 సీట్లను గెలుచుకొని ఎన్డీయేకు ఊపిరిపోసింది. టీడీపీ మద్దతుతో బీజేపీ సైతం ఏపీలో మూడు సీట్లను గెలుచుకోగలిగింది. ఇక తెలంగాణలో బీజేపీ తన సీట్లను రెట్టింపు చేసుకోగలిగింది. గత ఎన్నికల్లో నాలుగు సీట్లను గెలుచుకున్న కమలనాథులు ఈ ఎన్నికల్లో ఎనిమిది సీట్లను గెలుపొందారు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 14 శాతం ఓట్లను మాత్రమే పొందిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల నాటికి 35 శాతం ఓట్లను సాధించడం గమనార్హం. మరో దక్షిణాది రాష్ట్రం కర్ణాటకలో కూడా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ బీజేపీ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆ రాష్ట్రంలోని మొత్తం 28 సీట్లకుగాను బీజేపీ 17 స్థానాలను గెలుచుకోగా, దాని మిత్రపక్షం జేడీఎస్ రెండింటిలో గెలుపొందింది. బీజేపీ మొదటిసారిగా కేరళలో విజయం సాధించడం ద్వారా చరిత్ర సృష్టించింది. అనేక పర్యాయాలు ఆ రాష్ట్రంలో ఖాతా తెరిచేందుకు కమలనాథులు విఫల ప్రయత్నం చేశారు. కాగా ఈసారి సినీ నటుడు సురేశ్‌గోపీ బీజేపీ తరపున గెలుపొంది ఆ పార్టీకి మొదటి సీటును అందించారు. తమిళనాడులో బీజేపీ సినీ నటి రాధిక, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వంటి ఉద్దండులను బరిలో దించినప్పటికీ అక్కడి ప్రజలు వారిని ఆదరించలేదు. తమిళ ప్రజలు ఏకపక్షంగా అన్ని స్థానాల్లో డీఎంకే కూటమికి పట్టంకట్టారు.

